సంధ్యలో పక్షులు

ప్రసాదరావు ఆ వీధిలో నడుస్తూ — పరిసరాలను పరికించాడు. సాయం కాలం కావటం వల్ల ఆ వీధి అంతా అలంకరించుకున్న స్త్రీలతో సందడిగానే ఉంది. తనకు ఆ ప్రాంతం కొత్తగా ఉన్నప్పటికీ ఆతనికి తప్పలేదు. ఒక డాబా ఇంటిలోకి అడుగు పెట్టాడు. వరండా -



తెల్లవారింది

చిత్రం: వి. సి. హెచ్. రామమూర్తి [మద్రాసు—1]

అదే ఒక ముసలమ్మ ఎదురుపడి, "ఎవరు కావాలి?" అంది గారవళ్లు బయట పెట్టి నవ్వుతూ.

"మంజుల" అన్నాడు తడబడుతూ.

"లోపల ఉంది, వెళ్లండి" అంది పక్కకు తప్పుకుంటూ.

లోపల గది ముందే మంజుల నిలబడి ఉంది. "రండి" అంటూ లోపలికి దారి తీసింది. ఆమెను అనుసరించి ఒక కుర్చీలో కూచున్నాడు. ఆమె ఎదో కుర్చీలో కూచోగానే ఇందాకటి ముసలమ్మ కాఫీ తెచ్చి పెట్టి పోయింది.

"కాఫీ తీసుకోండి" అంది మంజుల తాను ఒక కప్పు తీసుకుంటూ.

"వద్దులెండి" అన్నాడు ప్రసాదరావు నబ్బందిగా.

"ఫరవాలేదు, తీసుకోండి" అంది మళ్లీ.

"అబ్బే, వద్దండి."

అతని బెరుకుదనానికి ఆమె నవ్వింది. "బాగుంది. మాంసం పట్టుకొని మడి కట్టుకున్నాను అన్నాడట ఒకాయన మీలాంటివాడే" అంది నవ్వుతూ.

ఆమె ఎగతాళికి అతను బాధపడ లేదు. పైగా, ఆమె నవ్వుకు ముగ్ధుడయ్యాడు. 'ఈమె అందం, అందానికి తగిన నవ్వు— ఆమెను వేళ్ళగా రాణింపుకి తెచ్చాయి' అనుకున్నాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అంది ఇంకా పెలయేటిలా నవ్వుతూ.

తమ పరధ్యానానికి అతను సిగ్గు పడ్డాడు. "అబ్బే! నాకు కాఫీ అలవాటు లేదు" అన్నాడు.

"పనీలెండి, మీరు వచ్చిన పని చెప్పండి" అంది.

అతను కాసేపు ఆలోచించి ప్రారంభించాడు. "నా పేరు ప్రసాదరావు. మీ వృత్తిరీత్యా మీ సాయం కావాలి. అందుకే వచ్చాను" అన్నాడు.

ఆమె విస్మయంగా అతణ్ణి చూసింది. "నేను వేశ్యను. నా వృత్తిలో స్వార్థమే గాని, ఇతరులకు సాయం లేదు. కడుపు కొక్కుర్తి కోసం ఆత్మను చంపుకుని శరీరాన్ని బ్రతికించుకుంటున్న పతితను— నేను మీ కెలా సాయపడగలను?" అంది.

"పరిమళ మిచ్చే మల్లెపూవు పూయాలంటే ముందు మొక్కకు ఎరువు వేయాలి. ఆ ఎరువు దుర్గంధ పూరిత మయినదని దాన్ని అసహ్యించుకుంటున్నామా? మీరు పతిత అయినప్పటికి మొక్కకు ఎరువు లాంటివారు. మీరు నాకు సాయం చేస్తే నా జీవితంలో మల్లెపూలు పూస్తాయి" అన్నాడతను.

ఆమె ఆలోచించింది. ఆమె ఏం చెప్తుందో అని అతను ఆత్రతగా చూడసాగాడు. ఆమె ప్రసన్నంగా అతణ్ణి చూసింది. "ప్రసాదరావుగారూ! నా సాహచర్యంలో నష్టపోయిన వారేగాని, లాభం పొందిన వారు ఇంతవరకు నాకు తెలియదు. కానీ, మీకు లాభం కలుగుతుందంటే నాకు చాలా ఆనందంగా ఉంది. జీవితంలో ఒక్కసారయినా ఒకరికి సహాయం చేయగలిగాననే తృప్తి మిగులుతుంది. అంతకన్న నాకు కావలసిందేముంది? చెప్పండి— మీ కేం సహాయం కావాలో" అంది.

అతను ఆమె మొహంలోకి సూటిగా చూస్తూ, "మీరు నాకు భార్య కావాలి" అన్నాడు.

ఆమె నిశ్చేష్టురాలయిపోయింది. "ఏమిటి మీ రంటున్నది? నేను మీకు భార్య నవాలా? అయితే నన్ను పెళ్లి చేసుకోవటానికి వచ్చారా?" అంది.

"క్షమించండి. నా ఉద్దేశం— మీరు ఒక్క రాత్రికి నా భార్యగా నటించాలి. అందుకు మీకు రావలసిన డబ్బు నే నిస్తాను."

"అంటే?" ఆమెకు సరిగా అర్థం కాలేనట్టుంది.

అతను ఒకసారి నిట్టూర్చి చెప్పటం ప్రారంభించాడు: "చెపుతాను, వినండి. నేను జీవితంలో అన్ని విధాల ఓడిపోయిన వాడిని. భవిష్యత్తు మీద ఆశతో వర్తమానాన్ని మొండిగా ఎదుర్కొంటున్న ఒక చిరు ఉద్యోగిని. తల్లితండ్రులు చచ్చిపోతూ మిగిల్చిన అప్పును అస్తిగా పెంచుకుంటున్న బడుగువాణ్ణి. ఇంటికి వెళితే ఆకలితో శత్రుమూకలా నలువైపులా చుట్టుముట్టే ముగ్గురు తమ్ముళ్లను, చెల్లాయిని ధైర్యంగా ఎదుర్కొనే శక్తిలేక బజార్లలోను, బస్సు స్టాండులోను కూలీ కోసం తిరిగే కూలీ నన్నే. చదువు పెట్టిన సంస్కారాన్ని ఆవకు నెట్టి పేదరికం తెచ్చే ప్రేరేపణతో పాపం చేయటానికయినా సిద్ధపడే ప్రసాదరావును." అతను మాటాడలేక పోయాడు.

ఆమె అతని వేపు సానుభూతిగా చూసింది.

అతను మళ్లీ చెప్పటం ప్రారంభించాడు: "ఈమధ్య మద్రాసులో ఒక ప్రైవేటు ఫరమ్‌లో సేల్స్ మానేజర్ పోస్టుకు అప్లయి చేసి రిటెన్ టెస్టు కూడా పాసయ్యాను. ఆ కంపెనీ జనరల్ మానేజర్ రేపు ఆదివారం ఇక్కడకు వచ్చి హోటలులో బస చేస్తున్నట్టు మద్రాసులో ఉన్న మా మిత్రుని నుండి ఉత్తరం వచ్చింది."

"ఇంతకూ నా సహాయం ఏమిటో చెప్పలేదు" అంది మధ్యలో.

"అదే చెప్తున్నాను. ఆ జనరల్ మానేజర్‌ను మీరు ఆ రాత్రికి కలుసుకుని నా భార్యగా పరిచయం చేసుకుని నా పరిస్థితి అంతా వారికి వివరించి, అవసరం అయితే మీరు ఆ రాత్రికి వారితో గడిపి ఆ ఉద్యోగం నాకు వచ్చేలా చేయాలి. అంతే."

'కావేరి, సావేరి'

పూర్తిగా విన్న తరవాత ఆమె ముఖం మ్లానమయిపోయింది "ప్రసాదరావు గారూ!" తాపీగా పిలిచింది.

అతను ఆశగా చూశాడు ఆమె వైపు.

"మీకు సహాయం చేయలేను" అంది కంపిత స్వరంతో.

అతను సందిగ్ధంలో పడి నిరాశగా అన్నాడు: "మీరు సాయం చేస్తారనే ఆశతో వచ్చాను. దురదృష్టం ఇంకా నన్ను వెంటాడుతూంది. జీవితంలో నాకిది ఎంతో దెబ్బ."

"రావుగారూ, వయస్సులో మీ కన్న చిన్నదాన్ని. కానీ, జీవితంలో మీ కన్న ఎక్కువ దెబ్బలు తిని మోసపోయినదాన్ని. అది మీకు తెలియదు. అందుకే మీకు సాయం చేయలేనంటున్నాను."

"నిజమే కావచ్చు. కానీ, మీ వృత్తి రీత్యా మీ కిది సాధ్యం. సులభంకూడా. ఎందరి దగ్గరో మీరు భార్యగా నటించి వారికి శారీరిక ఆనందం, సుఖం అందించే వృత్తి మీది. మీ కిది కొత్త కాదు. ఈ సహాయం చేయగలరు."

"చేయగలను. కానీ, చేయను."

"కారణం?"

"అది నా మనస్సుకు సంబంధించిన విషయం."

ఆశ్చర్యంగా చూశాడామెను.

"ఏమి టలా ఆశ్చర్యంగా చూస్తున్నారు? నాకు ఒక మనస్సనేది ఉందనా?"

"ఉందని నాకూ తెలుసు. కానీ, ఆ మనస్సును మలినం చేసుకుంటే తప్ప ఈ వృత్తిలో రాణించలేరనికూడా తెలుసు. అది తెలిసే మీ దగ్గరకు వచ్చాను."



"అవును. అది మలినమవటమే కాదు, గాయపడిందికూడా. కానీ, అందుకుకారణం మీ లాంటి మగవారే. మీ లాంటి మగవారి వల్లనే పతనమై ఈ నాడు ఈ నీచస్థితిలో ఉన్నాను."

"అదది మగవాడి వల్ల పతనమయిం దంటే ఆమెలోని బలహీనతలు అతనికి బాగా తెలుసన్న మాట. వాటిని కప్పిపుచ్చ లేనినాడు ఆమె తప్పక పతనమవుతుంది. ఆ పతనం నుండి ఆమె తప్పుకొని పయనిస్తే గాయపడిన మనస్సు తప్పక కోలుకుంటుంది."

"అంటే, తప్పంతా నాదే నంటారా?"

"క్షమించండి. ఆ ప్రయత్నం మీరు చేయలేదంటున్నాను."

ఆమె చురుగ్గా, సూటిగా అతణి చూసింది. "అందుకు మీరు సాయం చేయగలరా?" అంది.

చాలా తేలిగ్గా నవ్వేశాడు. "తప్పకుండా— నాకు చేతనైతే" అన్నాడు.

"మీరు నవ్వినంత తేలిక కాదు చేయటం."

"మీ కేం కావాలో అది చేయటానికి సిద్ధంగా ఉన్నాను."

ఆమె కాస్సేపు ఆగి, "మీరు నన్ను వివాహం చేసుకోవాలి. సమాజంలో ఒక స్త్రీకి కావలసిన ఉత్తమ స్థానం మీరు నా కివ్వాలి. ఈ పాపపు జీవితం నుండి విముక్తి కావాలి. మగవాడి వల్ల పతన మయిన నా జీవితం మగవాడి వల్లనే మరో మలుపు తిరగాలి. అది మీ వల్లనే జరగాలి" అంది ఆవేశంగా.

అతను నిర్ఘాంతపోయాడు. కలలో కూడా ఊహించరాని పరిస్థితి. అవాక్కయి పోయి ఆలోచనలో పడ్డాడు.

అతను మాటాడకపోవటంతో ఆమె తిరిగి అంది: "నాకు తెలుసు— మీ మగవాళ్లంతా అంతే. వేశ్య అనగానే అందరిలోనూ చులకన. నన్ను తమ అవసరాలకు ఉపయోగించుకునేవారే గాని, నాకు సహాయం చేయటానికి ఏ మగవాడూ ముందుకు రాడు. మీరూ అంతే, రావుగారూ."

"పొరపడుతున్నారు, మంజుల గారూ! మిమ్మల్ని వివాహం చేసుకోమానికిసిద్ధంగా ఉన్నాను."

అతను దృఢంగా అంటూంటే ఆమె నమ్మలేకపోయింది.

"బాగా ఆలోచించే అంటున్నారా?" అంది.

"ఆలోచించే అంటున్నాను. నా జీవితంలో మీరు మళ్లెలు పూయిస్తే, ఆ సౌరభాన్ని శాశ్వతంగా నాతోపాటు అనుభవించే అవకాశం మీకు కల్పిస్తాను."

అతని మాటలకు ఆమె నేత్రాలు ఆనందంతో మెరిశాయి. "అయితే మీకు నా సాయం తప్పక ఉంటుంది" అంది నవ్వుతూ.

* * *

"రావుగారూ! కంగ్రాట్స్!" అంది మంజుల ప్రసాదరావు రాగానే.

"ఏమిటి విశేషం? ఆర్డర్సు వచ్చాయా?" అన్నాడు చాలా ఆత్రతగా, కుర్చీలో కూచుంటూ.

"ఈ వేళ ఉదయమే వచ్చాయి" అంటూ తన పేరున వచ్చిన కవరు లోంచి ఆర్డర్సు తీసి అందించింది. చదివి, "చాలా థాంక్సండీ" అన్నాడు కృతజ్ఞతా పూర్వకంగా. అతని హృదయం ఆనందంగా ఉంది. చిరునవ్వుతో ఆమెను చూశాడు. కానీ, ఆమె ఏమాత్రం ఆనందంగా లేకపోవటం అతనికి అర్థం కాలేదు.

"మీరు ఏదోలా ఉన్నారు. కారణం తెలుసుకోవచ్చా?" అన్నాడు.

"అబ్బే, ఏం లేదు. మీరు ఎప్పుడు జాయినవుతారు?" అంది మాట మారుస్తూ.

"రేపు లేదు, ఎల్లుండే జాయినవ మని ఉందిగా ఆర్డర్సులో? మరి రేపే బయలుదేరాలి."

"సరే!"

ఆమె అలా ముక్తసరిగా మాటాడు తూంటే కారణాలు వెతకసాగాడు.

"మీ [illegible] బాగా చేసుకుంటుంది" అన్నాడు.

"మళ్లీ [illegible] కలుస్తారు?" అంటోంది.

"మళ్లీ కలవటానికి టైమ్ ఏది? ఇంటికి వెళ్లి లగ్గ [illegible] వాలి. ప్రయాణానికి [illegible] తీసుకోవాలి."

"అంటే?"

"ఏం లేదు. మీరు రేపు రాత్రికి డైరెక్టుగా స్టేషనుకు వస్తే అక్కడే కలుసుకోవచ్చు."

అతను అనుకు, వక్కకు అందకుండా మాటాడుతూంటే ఆమెకుకోపంవచ్చింది. "అంటే మీరు నన్ను పెళ్లి చేసుకోవటానికి నిశ్చయించుకున్నారా?" అంది సూటిగా.

"ఒకలుమాసం మీకు రాకూడదు."

"సరే" అంటూ ఆమె రెండు వందల రూపాయలు అందించింది అతనికి— "ఖర్చుకు ఉంచండి" అంటూ. వాటిని అందుకు ఎయులుచేరాడు. అతను వెళ్లగానే జారు ఫోరును పడుస్తూ, 'భగవాన్! ప్రసాదరావుకు నన్ను మోసగించే శక్తిని ప్రసాదించకు. లేదా నన్ను చంపేయి!' అనుకుంది.

* * *

రాత్రి ఎనిమిదయింది. ప్లాట్‌ఫారమ్ అంతా కోలాహలంగా ఉంది. మద్రాసు మెయిలు వచ్చి పావు గంట అయింది. ప్రసాదరావు తన ఎక్కిన కంపార్టుమెంటు వద్ద నిలుచుని మంజుల కోసం ఎదురు చూస్తూ ఉన్నాడు. అంతలో ఆమె రానే వచ్చింది చేతిలో చిన్న సంచితో.

"మీరు వస్తారో, రారో అనుకున్నాను" అన్నాడు.

"ఏం?" అంది అతని మొహంలోకి సూటిగా చూస్తూ.

"మీ రింకా రాకపోతేనూ!" అన్నాడు తొట్రుపాటుతో. అంతవరకు పెట్టెలో ఉన్న ముగ్గురబ్బాయిలు దిగి ప్రసాదరావు చేయి పట్టుకున్నారు. వారిని చూసి మంజుల ముచ్చట పడింది. "వీళ్ళు మీ తమ్ముళ్లనుకుంటాను. మీ చెల్లాయిని పరిచయం చేయలేదే!' అంది లోపల కూచుని ఉన్న శకుంతలను చూస్తూ.

"క్షమించండి, మరిచిపోయాను. వీళ్ల పేర్లు హరి, గోపీ, రాము" అని పెట్టెలోకి చూశాడు. అంతవరకు లోపల పుస్తకం చదువుకుంటున్న శకుంతల నవ్వుతూ దిగి మంజులకు నమస్కరించింది. "మీరే మనుకుంటాను మంజుల గారు! నా పేరు శకుంతల. మీ

కుటుంబానికి చాలా సాయం చేశారు. మీ మేలు జన్మలో మరిచిపోము" అంది కృతజ్ఞతాపూర్వకంగా. బండి బయలు దేరటానికి సిద్ధంగా అరిచింది. శకుంతల పిల్లలు ముగ్గురు పెట్టెలోకి ఎక్కి కూచున్నారు. హరి కిటికీలోంచి ప్రసాదరావుని పిలిచి, "నాన్నారూ! వీరుకూడా మనతో మద్రాసు వస్తున్నారా?" అన్నాడు మంజులను చూస్తూ.

మంజుల నిర్ఘాంతపోయి ప్రసాదరావును చూసింది.

అతను దొరికిపోయినవాడిలా తల దించుకున్నాడు.

బండి రెండో సారి అరిచింది. "క్షమించండి, మంజులగారూ. నాకు పెళ్లయింది. ముగ్గురు పిల్లలు" అన్నాడు చాలా నీరసంగా. అతని మాటలు ఆ ఇంజను అరుపుకన్న భయంకరంగా వినిపించాయి ఆమెకు. గుండెల్లో కసి, దుఃఖం ఆమెను క్రుంగదీశాయి.

"అయినా మిమ్మల్ని పెళ్లి చేసుకుంటాను. మాట తప్పను" అన్నాడు ఇంకా.

ఇంజను మరోసారి అరిచి మెల్లిగా ఎయలుదేరింది.

ప్రసాదరావు— "మీరు ఏ టిక్కెట్టు తీసుకున్నారు? నేను ఫస్టు క్లాసే తీసుకున్నాను, పిల్లలతో థర్డు క్లాసులో ప్రయాణం చేయలేమని. మీరుకూడా ఫస్టు క్లాసే తీసుకుంటే అందరం ఇందులోనే ఎక్కవచ్చు. లేకపోతే తొందరగా పక్క పెట్టెలోకి ఎక్కండి. బండి ఎయలుదేరింది" అన్నాడు ఆత్రతగా ఫుట్‌బోర్డుమీద నిలుచుంటూ.

ఆమె నిర్లిప్తంగా అంది: "ఫరవా లేదు లేండి. నేను మూడవ తరగతిలో ప్రయాణం చేస్తూ ఉంటాను."

"అయితే ఎక్కండి" అన్నాడు తాను దూరమవుతూ.

"అవసరం లేదు. ఈ ప్రయాణం, గమ్యం నాకు అవసరం అనిపిస్తూంది" అంది.

ఆ మాటలు అతనికి వినిపించాయో లేదోగాని బండి మాత్రం వేగం పుంజుకుంది. మంజుల క్షణ క్షణానికీ దూరమవుతున్న ప్రసాదరావును చూస్తూ నిలుచుండిపోయింది, మరోసారి ఓడిపోతూ. ఆమె కనుమరుగయిన తరవాత ప్రసాదరావు తన సీటులో కూచుండిపోయాడు, సగటు మనిషిలా.

హరి అంటున్నాడు— "నాన్నగారూ! ఆంటీ అక్కడే ఉండిపోయింది" అని, మంజుల నుద్దేశించి.

"అవును. ఆంటీ మనల సందర్శించడానికొచ్చిందిగా? అందుకే ఆమె ఉండిపోయింది—మనం దూరంగా పోతున్నాం. లేకపోతే మనంకూడా ఉండిపోయే వాళ్లం" అన్నాడు ప్రసాదరావు సాలోచనగా. ఆ పసివాడి కేం తెలిసిందో— "అవును, నిజం" అన్నాడు.

ఎక్కలేని వాళ్లతో లెక్కేమిటని మెయిలు ముందుకు పోసాగింది.

* * *

ఆ రాత్రి మంజుల ఇంటికి వస్తూనే మంచంమీద వాలిపోయింది. మనస్సు అల్లకల్లోల మయిపోయింది. ప్రసాదరావు చేసిన గాయం ఆమె గుండెను పిండివేయసాగింది. 'ప్రసాద్! నీవు మొదట్లోనే నీకు పెళ్లయిందని నిజం' చెప్పి ఉంటే ఎంతో సంతోషించేదాన్ని. వీరో మోసం, పిరికితనం పొలెక్కువ. అంతకు మించి స్వార్థం ఎక్కువ. స్వార్థపరు లెప్పుడూ అబద్ధాలు చెవుతారని మరోసారి ఋజువు చేశావు. నీ స్వార్థం, పిరికితనం నాలో తుఫాను రేపాయని నీకు తెలియదు. బహుశా అది నీవు ఊహించి ఉండవు. అది నీ తప్పు కాదు. నాది. ఈ పాడు బ్రతుకునుండి బయటపడడానికి ఆశించి మోసపోయాను. నాదే తప్పు' అనుకుంటూ ముందు రోజు వచ్చిన కవరు లోంచి ఉత్తరం తీసి చదవసాగింది.

"ప్రియమయిన మంజులా!

అలా పిలిచే అర్హత ఆరేళ్ల క్రితమే కోల్పోయాను గదూ? నాకు తెలుసు, నేను ఎంత పాపం చేశానో, ఎంత అన్యాయం చేశానో! లవ్వుతపాగర మనుకొని అజ్ఞానాగాధంలో పడిపోయాను. ఇంటిలో వెలుగు కోసం ఇల్లాలి చీరకే నిప్పంటించిన పాపాత్ముణ్ణి. ఆ మంటల్లో వెలుగే చూడగలిగాను గానీ, మాడిపోతున్న నిన్ను చూడలేని గ్రుడ్డివాణ్ణయ్యాను. కట్టుకున్న ఇల్లాలిని నా స్వార్థం కోసం పరాయి మగవాడి కౌగిలితో ఇరికించి తీరిగానవే వువాచిస్తే ఉద్యోగమనే శాశ్వత భద్రతాన్ని కట్టుకుని కుమిలుతున్న దౌర్భాగ్యుణ్ణి అంటే ఎవరూ నమ్మరు. నా జనరల్ మేనేజర్ హోదాను చూసి అభినందించినవారు, అందుకనే నెంత పాపం చేశావో తెలిస్తే ఎన్నోసార్లూ ఒళా గౌరవించారు. నే చేసిన పాపానికి ప్రతిఫలమో ఏమో— ఆ నాటి నుండి నాకు మనశ్శాంతి లేకుండా పోయింది. హోదాలో ఒక్కో మెట్టు ఎక్కే కొద్దీ చేసిన పాపం శాంతి లేకుండా చేసి, ఉద్యోగంతో ఆనందం, తృప్తి తొలగిపోవేసింది. కట్టుకున్న దాన్ని విడిచి మరొకరిని పెళ్లాడినందుకు ప్రతిఫలంగా, ఎవరో తెలుసుకొని ఒక స్త్రీకి ఒరిగిన అన్యాయాన్ని చూడలేక శాశ్వతంగా నాకు దూరమయింది, నాకు కనువిప్పు కలిగించి. అందుకే నీకు క్షమాపణ చెప్పుకుని, తిరిగి నిన్ను నా దానిగా చేసుకుందామనుకున్నాను. నీ గురించి కొద్ది నెలల క్రితమే తెలిసింది. నీ బ్రతుకు నాకు బాధ కలిగించలేదు. అందుకు కారణం నేను. అందుకే నిన్ను తిరిగి నాదానిగా చేసుకోవాలని అరాటపడి నీ అడ్రెసు తెలుసుకొని మొన్న వచ్చాను. కాని, నా దురదృష్టం— అప్పటికే నీవు పరులదాటిపోయావు. ఒకందుకు నాకు తృప్తిగా ఉంది. ఆ పాడు బ్రతుకునుండి నిన్ను బయటికి లాగిన ఆ ప్రసాదరావు నిజంగా అభినందనీయుడు. అతనికి నిజంగా నేను ఋణపడి ఉన్నాను. అందుకే ప్రసాదరావుకు మా కంపెనీలో సేల్స్ మేనేజర్ ఉద్యోగం ఇస్తూ అర్డర్సు పంపుతున్నాను. ఇది కేవలం నీ మీద నున్న మమత వల్లనే. నీ జీవితంలో మరో మలుపు తిరగాలంటే అది తప్ప వేరే మార్గం నాకు కనిపించలేదు. మొన్న నీ అభ్యర్థనకూడా అందుకు దోహదం చేసింది. ఒక్క విషయం— ఆ వాడు నీవు నీ భర్త కోసం తెలియక మోసగింపబడ్డావు. ఈ వాడు నీ భర్త కోసం తెలిసీ త్యాగం చేస్తున్నావు. చాలా చిత్రంగా ఉంది గదూ? మరో విషయం. నేను నా జనరల్ మేనేజర్ ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నాను. ఎందుకో తెలుసా? నేను నీ భర్తనని ప్రసాదరావుకు తెలియకూడదు. తెలిస్తే అతని జీవితంలో కలవరం, ఆఫీసులో కంకలం లేవదీసినవాడినౌతాను. మీ రిద్దరూ కంకాలం పోయిగా గడపాలి. అదే నా కోరిక. మీ ఇద్దరికి అభినందనలు. మరి నీ జీవితంలో కనుపించను. వెళ్లు.

—రజనీకాంతరావు."

ఆమె చదవటం పూర్తిచేసి వెక్కి వెక్కి ఏడవసాగింది, తన బ్రతుకు మంటలలోని మల్లెల బ్రతుకు కయినందుకు. ★



నీలాటి రేవు

ఫోటో: ఎస్. బి. తకల్కర్ [కొల్హాపూర్]